క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో క్రికెట్ అండర్–14, అండర్–23 జట్ల ఎంపిక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు క్రీడా సంఘాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, సమ్మద్, అమీన్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్‌ఐ జగన్మోహన్‌రెడ్డికి నివాళి

కేతేపల్లి: మండలకేంద్రానికి చెందిన రిటైర్డ్ ఎస్‌ఐ అలుగుబెల్లి జగన్మోహన్‌రెడ్డి(62) గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. జగన్మోహన్‌రెడ్డి మృతదేహాన్ని సోమవారం డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, మాజీ ఎంపీటీసీలు బొజ్జ సుందర్, మట్టి సునీతసాలమన్ సందర్శించి నివాళులర్పించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నార్కట్‌పల్లి : మండలంలోని మాధవ ఎడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న సన్‌సైన్ అవెన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కొప్పు రాము, ఉపాధ్యక్షుడిగా గున్‌రెడ్డి లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంబాలపల్లి అంజయ్య, జాయింట్ సెక్రటరీగా పి.శ్రీనివాస్, ట్రెజరర్‌గా జి.శివకుమార్, జాయింట్ ట్రెజరర్‌గా కె.శ్రీనివాస్‌చౌదరి, సభ్యులుగా మన్మథరెడ్డి, అమరవాజి రాజు, పి. వెంకన్న, నర్సారెడ్డిలను ఏకగ్రీవంగా ఎనున్నకున్నారు.

మర్రిగూడ : ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లో ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు హరికిషన్‌చౌహాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను, కోశాధికారి లక్ష్మణ్‌ల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రమావత్ విఠల్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రమావత్ రమేష్‌బాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా సపావత్ సక్కుబాయి, ప్రధాన కార్యదర్శిగా నేనావత్ రమేష్‌నాయక్‌ల తోపాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యుత్ ఎస్ఈకి సన్మానం

నల్లగొండ రూరల్: విద్యుత్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన ఐతగోని వెంకటేశ్వర్లుగౌడ్‌ను సోమవారం జిల్లా గౌడ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మగాని రాంబాబుగౌడ్, ప్రధాన కార్యదర్శి గుండగోని సోమశేఖర్‌గౌడ్, రవిగౌడ్, సోమయ్య, శంకర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కో కన్వీనర్‌గా నాగిళ్ల మారయ్య

మర్రిగూడ : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కోకన్వీనర్‌గా మర్రిగూడ మాల మహానాడు మండల అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య నియామకమయ్యారు. జిల్లా చైర్మన్ మధుబాబు చేతులమీదుగా సోమవారం ఆయన నియామకపత్రం అందుకున్నారు.

వైద్యారోగ్య శాఖ మంత్రిని కలిసిన ఆరోగ్యమిత్రలు

మర్రిగూడ : రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఇన్‌చార్జ్ సీఈఓ ఆర్వీ కర్ణన్‌ను హైదరాబాద్‌లో సోమవారం ఆరోగ్యమిత్రలు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, రాజు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

నార్కట్‌పల్లి : గోపలాయపల్లి గ్రామ సమీపాన గల శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం రోహిణి నక్షత్రం సందర్భంగా ఆలయంలో సుదర్శన హోమాన్ని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరీదేవి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీకాంత్, శివలక్ష్మి, నాగ చండీశ్వర్ వరలక్ష్మి, సాయిచంద్ర, శ్వేత, భవాని పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

మర్రిగూడ : ఖుదాబాక్షపల్లి గ్రామ పంచాయతీ పరిధి సాయిబండతండాలో గిరిజనుల ఆరాధ్య దైవం మేరియాడి, శ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్ విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి రూ.2.50 లక్షలను విరాళంగా అందజేశారు. లక్ష్మానాయక్, శ్రీనునాయక్, పాండునాయక్, సుధాకర్‌నాయక్, శ్రీను, లక్ష్మణ్, హనుమంతు, పాండుగౌడ్ పాల్గొన్నారు.

ఏజెన్సీ ఏర్పాటుపై పట్టింపేది !

- గతంలో రద్దయిన మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ
- 11 ఏళ్లుగా ఉపాధ్యాయుల చేతిలోనే నిర్వహణ
- నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్న త్రీమెన్ కమిటీ



చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

చండూరు : అధికారుల నిర్లక్ష్యం కారణంగా చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ 11 ఏళ్లుగా ఉపాధ్యాయుల చేతుల్లోనే కొనసాగుతోంది. విద్యార్థులకు చదువు నేర్పాల్సిన ఉపాధ్యాయులు తమ సమయాన్ని మధ్యాహ్న భోజనం వండించే పనికి కేటాయిస్తున్నారు. గతంలో రద్దయిన ఏజెన్సీ స్థానంలో నూతన ఏజెన్సీ ఏర్పాటు చేయాల్సిన త్రీమెన్ కమిటీ జాడ లేకుండా పోయింది.

గతంలో 20 మంది విద్యార్థులకు అస్వస్థత

చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2012వ సంవత్సరంలో సుమారుగా 20 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉండడంతో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. జిల్లా అధికారుల విచారణ అనంతరం సమభావన సంఘం ఏజెన్సీని బాధ్యులుగా చేర్చి ఏజెన్సీ రద్దుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆనాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయులే నిత్యం కూలీలను ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు వంటలు చేయిస్తున్నారు. ఫుడ్ పాయిజన్ విషయం ఇన్నాళ్లూ కోర్టు పరిధిలో ఉంది. ఇటీవల కోర్టు నుంచి తీర్పు వచ్చేసింది. అయితే నూతన ఏజెన్సీ ఏర్పాటుపై త్రీమెన్ కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. త్రీమెన్ కమిటీలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ ఉంటారు. కానీ ఇంతవరకు వారు నూతన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నియామకంపై నిర్ణయం తీసుకోలేదు.

తమకే కేటాయించాలంటున్న మహిళా సంఘాలు

పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ లేకపోవడంతో అనేక ఏళ్లుగా కొందరు మహిళలు రోజువారీ కూలీలుగా పనిచేస్తూ మధ్యాహ్న భోజనం వండుతున్నాం. అయితే వారు పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ తమకే కేటాయించాలని అధికారులను ఆశ్రయిస్తున్నారు. కాగా నిబంధనల మేరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీని త్రీమెన్ కమిటీ నియమిస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకుపోయా



నేను ఇటీవల ఎంఈఓగా బాధ్యతలు తీసుకున్నా. చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న మహిళలు హెచ్‌ఎంపై శనివారం డీఈఓకు ఫిర్యాదు చేసినట్లు పత్రికల్లో చూశాను. నాకు డీఈఓ నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ ఏర్పాటుపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయా.

–సుధాకర్ రెడ్డి, ఎంఈఓ

మహిళలకు మద్దతుగా మధ్యాహ్న భోజనం ఏజెన్సీల సంఘం, విద్యార్థి సంఘాలు డీఈఓకు వినతి పత్రం అందజేశారు. దీంతో ఆ పాఠశాల హెచ్‌ఎంకు మధ్యాహ్న భోజనం వండే మహిళలకు మధ్య నెలలుగా వివాదం కొనసాగుతోంది. ఇదే వివాదం చిలికి..చిలికి గాలి వానలా తయారై వ్యక్తిగత విషయాలకు చేరి జిల్లా అధికారుల చెంతకు చేరింది. ఇదే విషయంపై త్వరలో డీఈఓ పాఠశాలలో విచారణ చేయనున్నట్లు సమాచారం. అధికారులు త్వరగా స్పందించి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని నియమించి విద్యార్థులకు సరైన సమయానికి భోజనం అందేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అన్ని గ్రామాలకు రోడ్లు మంజూరు చేస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తిప్పర్తి : మండలంలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేస్తానని, విద్యుత్ సమస్య లేకుండా చేస్తానని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మాడ్గులపల్లి వెళ్లి తిరిగి నల్లగొండకు వెళ్లే క్రమంలో తిప్పర్తిలో మంత్రి కాసేపు ఆగారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తిప్పర్తి మండల కేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు పూర్తవుతాయని తెలిపారు. మండల కేంద్రంలో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు బద్దం సుధీర్, పాశం నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి



రామగిరి(నల్లగొండ) : మంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఫిజియోథెరపిస్ట్ సంఘం నాయకులు

రామగిరి (నల్లగొండ): ఫిజియోథెరపిస్టుల యూనియన్‌కు సొంత భవనం నిర్మించాలని, కౌన్సిల్‌కు గుర్తింపు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఫిజియోథెరపిస్టుల సంఘం నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సైదయ్య, ఉపాధ్యక్షుడు హేమంత్‌కుమార్, కార్యదర్శి యాదయ్య, నాగరాజు, వంశివర్ధన్, సత్యవాణి, ప్రియాంక, శ్రీవాణి, అనూష, సత్య పాల్గొన్నారు.

రెడ్డి ల్యాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

నల్లగొండ: రెడ్డి ల్యాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ నిర్వాహకురాలు అల్మాస్ పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, సెక్టార్ రెడీనెస్, ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై రెండు నెలలపాటు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు గడియారం సెంటర్‌లో గల సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఫెయిల్, పాసైనవారు అర్హులన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7032649925, 9177785983 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజల రక్షణే పోలీసుల కర్తవ్యం



రామగిరి(నల్లగొండ): మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): ప్రజల రక్షణే కర్తవ్యంగా పోలీసులు పనిచేస్తారని వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.సుధారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి



కట్టంగూర్: నాగరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ రవీందర్, గ్రామస్తులు

కట్టంగూర్: పోలీసు అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని కట్టంగూర్ ఎస్‌ఐ ఎం.రవీందర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో కానిస్టేబుల్ చెవుగోని నాగరాజు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య,రెడ్డిపల్లి సాగర్, బెజవాడ సైదులు, మర్రి రాజు, మిట్టపల్లి శివశంకర్, బొజ్జ శ్రీను, రెడ్డిపల్లి వీరస్వామి తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం



చిట్యాల: పిట్టంపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం



నకిరేకల్ : టేకులగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, మాజీ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి, డైరెక్టర్లు గంగాపురం భాస్కర్‌గౌడ్, గడ్డం సత్తిరెడ్డి, టేకుల కవిత, మురాల గోపయ్య, మామిడి శ్రీరాములు, మాజీ సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ పాల్గొన్నారు.

నకిరేకల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి ఎగుమతి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులకు సూచించారు. నకిరేకల్ మండలం టేకులగూడెం, వల్లభాపురం, ఓగోడు, నెల్లిబండ, గోరెంకలపల్లి గ్రామాల్లో ఎన్‌డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌డీసీఎంఎస్ జిల్లా చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జుమురుద్దీన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, మండల వ్యవసాయ అధికారి జానిమియా పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

చిట్యాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలంలోని నేరడ, ఎలికట్టె గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఎలికట్టె పాల ఉత్పత్తిదారుల కేంద్రం చైర్మన్ గుత్తా యాదగిరిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చినమల్లయ్య, కొండకింది వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కేతేపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. కేతేపల్లి మండలంలోని కాసనగోడు, బొప్పారం, గుడివాడ, ఇప్పలగూడెం గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దారు ఎన్.మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ వి.నర్సయ్య, ఏపీఎం బి.యాదమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. సోమవారం నార్కట్‌పల్లి మండలంలోని చిప్పలపల్లి, బెండల్‌పహాడ్ బాజకుంట గ్రామల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ సుధాకర్, ఏపీఎం శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదలైన ధాన్యం కొనుగోళ్లు

శాలిగౌరారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఈ నెల 14న ప్రారంభించారు. కానీ వివిధ కారణాల వల్ల ధాన్యం కొనుగోళ్లు జరుగలేదు. తొలిరోజు 1800 బస్తాల ధాన్యం(720 క్వింటాళ్ళు) కొనుగోలు జరిగినట్లు కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

ఎంఈఎఫ్ నాయకుడు అంజయ్య మృతి



కందికంటి అంజయ్య(ఫైల్)

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన మాదిగ ఉద్యోగుల సంఘం(ఎంఈఎఫ్) జాతీయ నాయకుడు కందికంటి అంజయ్య(49) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. అంజయ్య నకిరేకల్‌లోని వాసవి ఎయిడెడ్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. ఆ తరువాత స్థానిక ప్రభుత్వ కళాశాలలో పనిచేశారు. అటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. అంజయ్యకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. మృతదేహన్ని స్వగ్రామం మంగళపల్లికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అంజయ్య మృతదేహన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం–పుష్ప దంపతులు, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, దైద రవీందర్, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, చామల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మాచర్ల సైదులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేత దైద రవీందర్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



కట్టంగూర్ : ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంకు చెందిన నాగిళ్ళ సుధాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకున్న 2000–01 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు తమ స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. వారు సేకరించిన యాభై వేల ఐదు వందల రూపాయలను ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను సోమవారం సుధాకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఏళ్ల శ్రీశైలం, దగ్గుల యాదగిరి, తాడూరి మల్లేష్, రమేష్, అశోక్, రవి, సంతోష్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని కురుమర్తి గ్రామానికి చెందిన పనస నరేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నరేష్ కుటుంబాన్ని ఆదుకునేందుకు కురుమర్తి హైస్కూల్‌లో 2008–09 విద్యా సంవత్సరంలో అతడితోపాటు ఎస్సెస్సీ చదువుకున్న స్నేహితులు రూ.18500, గ్రామస్తులు రూ.39,300 సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఇట్టబోయిన శ్రీను, గడగోజు సురేష్, ఊట్కూరి సురేష్, చల్లా మిథున్, అనంతుల అశోక్, కడారి నర్సింహ, బుడిగ సైదులు, వడ్లకొండ సైదులు, వంగూరి ఐలయ్య, గండమల్ల మనోజ్, పనస గోపమ్మ, రాణి పాల్గొన్నారు.

సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ర్యాలీ



పెద్దకాపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి–రామన్నపేట ప్రాంతాల మధ్య సిమెంటు పరిశ్రమ ఏర్పాటును నిరసిస్తూ సోమవారం పెద్దకాపర్తిలో గ్రామస్తుల తోపాటు విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన రామన్నపేటలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, చేకూరి గణేశ్ మాదిగ, ముద్దసాని రమణారెడ్డి, ఆవుల జానయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి, యాదగిరి, సాగర్ల నాగరాజు, ఏర్పుల గణేశ్ పున్న విష్ణు, తిరుమలేష్, రాకేష్, దామోదర్, చిలువేరు శివయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జిల్లా ముందంజ

నకిరేకల్ : వానాకాలం ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా ముందుందని జిల్లా పౌర సరఫరాల అధికారి(డీఎస్ఓ) వెంకటేశ్వర్లు తెలిపారు. నకిరేకల్‌లోని తాటికల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో చీమలగడ్డలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి రైతులు, సిబ్బందితో మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాలో 285 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. వీటిలో 70 కేంద్రాలు సన్న రకం ధాన్యం కేంద్రాలు ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు తిరస్కరిస్తున్నందున ప్రత్యామ్నాయంగా జిల్లాలో 8 గోదాములను గుర్తించి అందులో ధాన్యం నిల్వ చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక డీటీసీఎస్ జ్యోతి, కేంద్రం ఇన్‌చార్జి నాగరాజు, కేంద్రం నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

పథకాలను సక్రమంగా అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా చేపట్టిన ఆరోగ్య పథకాలను సక్రమంగా అమలు చేసే విధంగా సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో దేవరకొండ డివిజన్‌కు సంబంధించిన మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నకిరేకల్ : మండలంలోని బైరెడ్డిగూడెం, అడివిబొల్లారం గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి సోమవారం ఆయా గ్రామాల్లో గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. గాదగోని కొండయ్య, బొప్పడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మిర్యాల చంద్రశేఖర్, వెంకటేశం, సైదులు, ప్రభాకర్, సునీల్, గోవిందరెడ్డి, యాదగిరి, యాదగిరెడ్డి, ఆంజనేయులు, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్ విడుదల

నల్లగొండ: ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష ధర్నా పోస్టర్‌ను సోమవారం నల్లగొండలోని తపస్ కార్యాలయంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అలుగువెల్లి పాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఐరుగు శ్రీరామ్ విడుదల చేశారు. ఈ నెల 22న పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన, 28న అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల్లో సమస్యలపై వినతి, నవంబర్ 5న కలెక్టరేట్ వద్ద ధర్నా, 23న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష పేరిట హైదరాబాద్ చలో ఇందిరా పార్క్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'కోణం' కృషి అభినందనీయం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

నల్లగొండ టౌన్: రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం కోణం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రావణ్ కుమార్ అన్నారు. నల్లగొండ వ్యవసాయ కార్యాలయంలో సోమవారం కోణం ఫౌండేషన్ సహకారంతో కట్టంగూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ రూపొందించిన కస్టమ్ హైరింగ్ సెంటర్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ సదుపాయాలను 7780507439 నంబర్‌కు ఫోన్ చేసి రైతులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని చంద్రకళ, సైదమ్మ , నరేష్, మహేష్ , నరేష్, అంజయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రైతుల వినతి

నల్లగొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బత్తాయి రైతులు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. పులిమామిడి శ్రీనివాస్, చిర్ర భూపాల్ రెడ్డి, చిలుక వెంకట్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శివారెడ్డి, మాధవ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, కిరణ్‌రెడ్డి, గిరిరాజు, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది' నాణేల వినియోగంపై అవగాహన

నల్లగొండ: అన్ని బ్యాంకుల్లో పది రూపాయల నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని, అందరూ నాణేలు తీసుకోవాలని కోరుతూ గ్రామీణ వికాస బ్యాంకు ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంక్ సిబ్బంది బ్యానర్లు పట్టుకుని షాపులు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. చిన్న వ్యాపారులంతా పది రూపాయల నాణేలు తీసుకోవడం లేదని, దాంతో రిజర్వు బ్యాంకు సూచన మేరకు ప్రచారం చేస్తున్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వికాస్ బ్యాంకు రీజనల్ మేనేజర్ బి. విజయభాస్కర్, సీహెచ్.వెంకటేష్, ఎం.దేవేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఏవీఎం విద్యార్థులు

నకిరేకల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నల్లగొండలో నిర్వహించిన కబడ్డీ అండర్–14, 17 విభాగాల్లో నకిరేకల్‌లోని ఏవీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీడీ నిమ్మల శంకర్ సోమవారం తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో వి.తేజశ్రీ, వి.శ్రీనిత్య, ఎస్.నిఖిత, అండర్–14 బాలుర విభాగంలో ఎం.చరణ్, కే.జగదీష్, పి.రామచంద్రు, జే కృష్ణుడు, సాయిచరణ్, అండర్–17 బాలుర విభాగంలో ఎం.ప్రణయ్ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి అభినందించారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



జిల్లా కేంద్రంలో పోలీసు అమరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



నివాళులర్పిస్తున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్



నివాళులర్పిస్తున్న చిన్నారులు